క్లుప్తంగా

గంగమ్మకు బోనాలు



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు గురువారం అనంతపురం గ్రామ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు అమ్మవారికి జాతర మరుసటి రోజున బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఆదిమూలం చిన్నప్ప వంశీయులు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు

రాజంపేట : హైకోర్టు జడ్జి నయనాల జయసూర్యను రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట కోర్టు సమస్యలను విన్నవించారు. న్యాయవాదులు ఇంటి స్థలాల గురించి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రఘునాథరెడ్డి, కృష్ణకుమార్, రమేష్ పాల్గొన్నారు. అనంతరం జడ్జికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.15లక్షలు

రాజంపేట : మహాశివరాత్రి పండుగ సందర్భంగా రూ.15,78,293 ఆదాయం వచ్చిందని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు గుండాల రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హత్యరాల, గుండాల కోన, తలకోనకు బస్సు సర్వీసులు నడిపామన్నారు. తక్కువ బస్సులు తిప్పి ఎక్కువ ఆదాయాన్ని సంపాదించినట్టు తెలియజేశారు. గత సంవత్సరం 52 సర్వీసులు తిప్పగా, ఈ సంవత్సరం 35 సర్వీసులు మాత్రమే నడిపామన్నారు. కార్మికులు, అధికారులు కలికట్టుగా పనిచేసిన ఫలితమే ఆర్టీసీకి ఆదాయం లభించిందన్నారు.

ఇంటర్ డ్రాప్ అవుట్స్‌కు చక్కటి అవకాశం

రాజంపేట టౌన్ : 2021- 23 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యను మధ్యలో ఆపివేసిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు చక్కటి అవకాశం ప్రకటించిందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదివితే ఆ కళాశాల ద్వారానే ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి సంబంధిత పత్రాలను కళాశాలలో అందజేయాలని తెలిపారు. విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలోనే పరీక్షలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

పరామర్శ

రామాపురం : సుద్దమళ్ల గ్రామ మాజీ సర్పంచ్ గడికోట బయారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శుక్రవారం (నేడు) శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని పీజేఆర్ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2:30కు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ రంగస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. ఓటర్లకు తగు ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈయన వెంట ఇంచార్జి తహసీల్దార్ అజర్ అలీఖాన్, ఎంపీడీఓ దివ్య, రూరల్ సీఐ లింగప్ప పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



పెద్దఎత్తున హాజరైన వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వేదికపై వైఎస్సార్‌సీపీ నేతలు

- సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ఇంటింటా వివరించండి
- వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : నూతనంగా నియమితులైన గృహసారథులు, కన్వీనర్లు, ప్రతికుటుంబానికి సన్నిహితంగా ఉంటూ గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ పరిధిలోని సచివాలయం వలంటీర్లు, పార్టీ కన్వీనర్లు, గృహ సారథులకు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ముఖ్యంగా తమకు కేటాయించిన గృహాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలంటూ సూచించారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి తమను జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అని ముద్రించిన కరపత్రాలతో గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏమిచేసింది? ప్రస్తుత సీఎం జగనన్న ఏమిచేస్తున్నారో ప్రజలకు వివరించాలంటూ కోరారు. అందరూ కలసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలంటూ కోరారు.

బాబు, పవన్ సొంతంగా ఎందుకు పోటీచేయరు?

ప్రజల్లో విశ్వాసం ఉంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎన్నికల్లో ఎందుకు ఒంటరిగా పోటీచేయడం లేదంటూ శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే దమ్ములేక పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవ చేశారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ధర్మం వైపు నిలిచిన జగనన్నకు తోడుగా నిలవాలని కోరారు.

రాయచోటికి టీడీపీ ఏమి చేసిందో చెప్పాలి?

నాడు వైఎస్సార్ హయాంలో రాయచోటి ప్రజల కోసం రాయుడు కాలనీ, సిబకతుల్లా కాలనీ, ఇందిరమ్మ కాలనీలను నిర్మించారన్నారు. జగనన్న పాలనలో నారాయణరెడ్డిపల్లె సమీపంలో 6వేల ఇళ్ళతో కూడిన జగనన్న కాలనీని అన్ని మౌలిక వసతులతో నిర్మిస్తున్నారన్నారు. నియోజకవర్గం పరిధిలో సుమారు 20 వేల పక్కా గృహాలను మంజూరు చేశారన్నారు. టీడీపీ పాలనలో అత్యల్పంగా పక్కాగృహాలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలోకి దిగుతున్న అభ్యర్థులను గెలిపించుకుందామంటూ ఆయన గృహసారథులు, వలంటీర్లకు పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిల్లీస్ ఫయాజ్‌బాషా, ఫయాజుర్ రహిమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కరీముల్లా, మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లా ఖాన్, వైఎస్సార్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, మదన్‌మోహన్‌రెడ్డి, సుగవాసి ఈశ్వర్, శ్యామ్, నరసింహారెడ్డి, చెన్నూరు అన్వర్, సాదిక్ అలీ, ఆసిఫ్‌అలీఖాన్, షబ్బీర్, ఆనందరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, బుజ్జిబాబు, రిజ్వాన్, రియాజ్, పల్లారమేష్, నవరంగ్ నిస్సార్, అన్సారలీం తదితరులు ప్రసంగించారు.

రూరల్ మండల గృహసారథులతో..

జగనన్న ప్రభుత్వ జనరంజక పాలనపై గృహసారథులు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి రూరల్ మండల గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత పార్టీశ్రేణులపై ఉందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి జగనన్న ప్రభుత్వ పథకాల గురించి వివరించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పల్లపు రమేష్, వెంకట నరసింహారెడ్డి, తిరుపాల్‌నాయుడు, ఖాదర్‌వలీ, దివాన్ సాహెబ్‌తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పనులు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

సిద్దవటం : జగనన్న కాలనీలలో బేస్‌మట్టాలు వేసి అపై పనులు కొనసాగించని లబ్ధిదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించినట్టు నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం పక్కా గృహాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు తమకిచ్చిన గృహ నిర్మాణాలకు సంబంధించి లక్ష్యాలను ఎంతమంది ఏఏ పనులు చేయించారనే విషయంపై ఆరా తీశారు. బేస్ మట్టం నిర్మించి, గోడ కట్టడాలను మొదలు పెట్టనివారిని, స్లాబ్ పనులు మొదలు పెట్టనివారిని, అసలు ఇంటినిర్మాణ పనులు మొదలు పెట్టనివారిని గుర్తించి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు జారీ చేయాలన్నారు. ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధాన ప్రక్రియను బీఎల్‌ఓలతో త్వరితగతిన పూర్తి చేయించాలని తహసీల్దారు శంకర్‌రావుకు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్ సింగ్, తహసీల్దారు శంకర్‌రావు, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే విషం చిమ్ముతున్నారు

పట్టాభి విషయంలో పచ్చ పత్రికల వైఖరిని తప్పుబట్టిన ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి



ఈనాడు పత్రికను దహనం చేస్తున్న సాయికిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు, పచ్చ మీడియా పనిగట్టుకొని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టారు అని ఈనాడులో అసత్యపు కథనంపై ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఈనాడు పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అసత్య కథనాలను అందిస్తూ ఈనాడు తన వక్ర బుద్ధిని తెలియజేసిందని ఆరోపించారు. పట్టాభిపై రెండేళ్ల క్రితం దాడి జరిగిన ఫొటోలను ప్రచురించి పత్రిక విలువలను దిగజార్చిందన్నారు. పథకాలు, అభివృద్ధిపై ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి జీర్ణించుకోలేక ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి నిత్యం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. చంద్రబాబు, పచ్చ పత్రికలు ఎన్ని జిమ్మికులు చేసిన ప్రజల్లో విశ్వాసం పొందలేరని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు టి.కృష్ణరెడ్డి, ఆళ్ల ఈశ్వరయ్య, ఎంపీటీసీ గోగడ దుర్గ ప్రసాద్, బీఆర్ ప్రేమ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

27 నుంచి 2వ విడత సంగ్రామ పాదయాత్ర



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయచోటి అర్బన్ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం ఈనెల 27న సుండుపల్లె నుంచి 2వ విడత సంగ్రామ పాదయాత్రను చేపట్టనున్నట్టు ఎంఎస్‌పీ జిల్లానేత రామాంజనేయులు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశం జిల్లా కన్వీనర్ బండకింద మనోహర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎస్‌పీ నేత రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని, బీజేపీ మాదిగలకు ప్రధాన శత్రువు అనే అంశాన్ని గ్రామస్థాయిలోకి తీసుకెళ్ళాలన్నారు. మార్చి 15న నిర్వహించే అమరావతి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా మాదిగలను సమాయత్తం చేసేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు పాదయాత్రను విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎమ్మార్పీఎస్ నేతలు గడ్డం మహదేవ, గుంటిమడుగు ఆనంద్, ఆంజనేయులు, వినోద్, సి.వి.రమణ, నరసింహులు, సుబ్బరాయుడు నేతలు ఎంఎస్‌పీ నేతలు నాగరాజు, సుబ్బయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు.. సంక్షేమ ప్రచార సైనికులు

- గడప గడపకు సీఎం చేసిన మేలును తెలియజేయండి
- మా నమ్మకం నువ్వే జగన్‌లో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు



కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట : ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు గృహసారథులే ప్రచార సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ శివార్లలోని ఎస్‌వీఆర్ కల్యాణ మంటపంలో రాజంపేట గ్రామీణ ప్రాంతాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేకూరే విధంగా తీసుకొచ్చిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని ప్రతి ఒక్కరికి తెలిజేసేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి పాలనపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలను చైతన్యపరచాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ పట్టం కట్టేలా ప్రజలకు సీఎం చేసిన మేలును వినిపించాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉద్దేశ, లక్ష్యాలను, అమలు చేయాల్సిన విధివిధానాలను గృహ సారథులు, వలంటీర్లకు తెలియజేశారు. గృహసారథులు ప్రభుత్వానికి సంక్షేమ పథకాల విషయంలో ప్రజల్లో ఇంకా మెరుగుపరిచేందుకు తమ సలహాలు, సూచనలకు 8296082960లో మిస్‌కాల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొందూరు శరత్‌కుమార్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ మందరం గంగిరెడ్డి, పార్టీ కన్వీనర్ దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, పార్టీ నేతలు రామ్మోహన్‌నాయుడు, నాగా సుధాకర్‌రెడ్డి, నాగా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, వరదరాజు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు బొడిచెర్ల శివయ్య, కొండూరు విశ్వనాథరాజు, సర్పంచులు, ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా మలేరియా అధికారిణి మనోరమ



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లో నివాస గృహాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారిని మనోరమ అన్నారు. మండలంలోని కమ్మపాలం గ్రామంలో డెంగ్యూ కేసు నమోదవ్వడంతో గురువారం ఆమె కమ్మపాలెం ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమె వైద్య సిబ్బందితో గ్రామంలో తిరిగి రక్త నమూనాలను సేకరించారు. పలు వీధుల్లో అబెట్ ద్రావణాన్ని స్ప్రే చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. అనంతరం జిల్లా మలేరియా అధికారిణి మాట్లాడుతూ కొద్దిపాటి జ్వరం ఉన్న వెంటనే అందుబాటులో ఉన్న వైద్యశాలకు వెళ్లి వైద్యులతో సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. రాత్రి పూట ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంటు మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ అధికారి ఐ. సుబ్బరాయుడు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఓబులవారిపల్లె : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ సుబ్రమణ్య ప్రసాద్ కోరారు. గురువారం మంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాజాత ద్వారా బ్యాంక్ సేవలపై ఖాతాదారలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీ రేటుతో బంగారుపై రుణాలు ఇస్తున్నామని తెలిపారు. అలానే బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. అనంతరం కళాజాత బృందం బ్యాంక్ సేవలపై ఖాతాదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, హెడ్ మాస్టర్ రవికుమార్, చంద్రారెడ్డి, వెంకటరత్నం, నరసింహమూర్తి, చిరంజీవి, వెంకటేష్ కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర సభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : ఒంగోలులో ఈనెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో గురువారం మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్‌యూ ఎప్పుడు అలుపెరగని పోరాటాలు సాగిస్తూనేవుందన్నారు. తమ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని ఆయన తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలపై రాష్ట్రనాయకులు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు కిరణ్, సుకుమార్, అలీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

వీరబల్లి : మండల పరిధిలోని సానిపాయి గ్రామ సమీపంలో 39 ప్యాకెట్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్టు ఆర్ఐ గోపి తెలిపారు. రాజంపేట నుంచి రాయచోటికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సానిపాయి వద్ద విజిలెన్స్ సీఐ ఈదురుబాషా తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆటోతోపాటు మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. పట్టుబడిన బియ్యాన్ని వీరబల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించామని తెలిపారు.

25, 26న పోలేరమ్మ జాతర

గాలివీడు : మండల కేంద్రంలోని పూసలపేట, శెట్టివారిపల్లెలో వెలసిన పోలేరమ్మ జాతర ఈనెల 25, 26వ తేదీల్లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర సందర్భంగా శనివారం రాత్రి చెక్కభజనలు, ఛాందినీ బండ్లతో గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు. ఆదివారం ఉదయం మహిళలు బోనాల రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని, భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

దుకాణాల తనిఖీ

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో జిల్లా తూనికలు, కొలతల అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం జిల్లా తూనికలు, కొలతల శాఖ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో విక్రయించే సరుకులు, వస్తువులను పరిశీలించారు. వస్తువుల నాణ్యత, అవి ఎక్కడ తయారయ్యాయి.

యాజమాన్య పద్ధతులు పాటించండి

మదనపల్లె : రైతులు చిరుధాన్యాలు పండించడంపై మక్కువ కనబరుస్తున్నారని, మేలైన పంటల యాజమాన్య పద్ధతులతో వీటిలో అధికదిగుబడులు సాధించవచ్చని అన్నమయ్య జిల్లా డీఆర్సీ ఏడీఏ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చిన్నతిప్పసముద్రం ఆర్‌బీకేలో గురువారం వరి, ఇతర పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ నీటితో, తక్కువ సమయంలో పోషకాలు పుష్కలంగా కలిగిన సజ్జ, కొర్ర, అరికలు, రాగి తదితర చిరుధాన్యాల ఆవశ్యకత, వాటి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణపై తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణంలోని బాబుకాలనీకి చెందిన ప్రశాంత్ భార్య నందిని(26) పలువురి వద్ద అప్పులు చేసి పుట్టింటివారికి ఇచ్చిందని, ఈ విషయం ఇటీవల అత్తింటివారికి తెలియడంతో వారు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ : కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రీడ్ సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం- వాటి అనర్థాలు అన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పంట నమోదు తప్పనిసరి



సంబేపల్లె: ఈ పంట నమోదుపై రైతులతో మాట్లాడుతున్న శ్రీలత

సంబేపల్లె : రైతులు పండించిన పంటలకు విధిగా ఆర్‌బీకేల్లో పంట నమోదు చేసుకోవాలి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీలత తెలిపారు. మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లె పంచాయతీలో సాగు చేసిన పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించాలన్నారు. నమోదు చేసుకున్న రైతులకు పంట రుణాలు, ఇన్సూరెన్స్, పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామాంజులురెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

28లోపు ఈ– పంట నమోదు చేసుకోండి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని రైతులు ఈ– పంట నమోదు, బయోమెట్రిక్‌ను ఈనెల 28లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్‌కేవీ సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో కోరారు. మీ పరిధిలోని ఆర్‌బీకేలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వాలు కృషి

- వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు సహకరించాలి
- నందలూరు టీబీ యూనిట్ అధికారిణి డాక్టర్ సృజన



క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ సృజన

నందలూరు(రాజంపేట) : క్షయవ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని నందలూరు టీబీ యూనిట్ అధికారిణి డాక్టర్ సృజన తెలిపారు. మండల కేంద్రంలో గురువారం క్షయ వ్యాధిగ్రస్తుల ఇంటివద్దకు వెళ్లి మందులు క్రమంగా తింటున్నారా లేదా అరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా చికిత్సలో ఉన్న క్షయ రోగులకు నెలనెల వారికి కావలసిన పౌష్టికాహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆమె కోరారు. నందలూరు టీబీ యూనిట్ పరిధిలో నందలూరు, రాజంపేట, పెనగలూరు మండలాల్లో ప్రస్తుతం చికిత్సలో ఉన్న 150 మంది రోగులకు గాను 18 మందిని మాత్రమే దత్తత పూర్తి అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో నందలూరు మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా క్షయ చికిత్స సమన్వయకర్త నాగేంద్ర, నందలూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీ ఆరీఫ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.